

## రాహుల్ గాంధీపై అక్రమ ఎఫ్ఐఆర్ రద్దు చేయాలి

**ఖర్గే అవమానంపై ప్రశ్నిస్తే రాహుల్ పై కేసా?**

**కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్**

కరీంనగర్,ఆగస్టు 31(వాయిస్ టుడే): హల్ద్వానీలో ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ర్యాలీ వేదిక వద్ద బీజేపీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చేసిన కులతత్వ శుద్ధీకరణ ఆచారంను ఖండించినందుకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీ సిటీ కోత్వాలి పోలీస్ స్టేషన్ లో బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ,టీపీసీసీ పిలుపు మేరకు నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను అవమానించిన దోషులపై చర్యలు తీసుకోకుండా,వారిని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై కేసు పెట్టడం బీజేపీ దుర్మార్గానికి నిదర్శనం.కుల ఆధారిత వివక్షను,దళితులపై అఘాయిత్యాలను ప్రశ్నిస్తే అణచివేయాలని చూడటం బీజేపీ నైజం.ప్రభుత్వ ప్రేరేపిత వేధింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదు.సామాజిక న్యాయం,రాజ్యాంగ సమానత్వం కోసం మా పోరాటం కొనసాగుతుంది.వెంటనే రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ ఎఫ్ఐఆర్ ను ఎత్తివేసి,అసలు దోషులైన బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజ్ హుస్సేన్,కర్ర సత్య ప్రసన్న రెడ్డి,శ్రావణ్ నాయక్,కొరివి అరుణ్ కుమార్,పర్వత మల్లేశం,కాంతల జగన్ రెడ్డి,వరాల నర్సింగం,ఆకుల ఉదయ్, ముసుకు ఉపేందర్ రెడ్డి,విక్రమ్,కొమ్మెర రవీందర్ రెడ్డి,దిండిగాల మధు,లాయికు, ఖలీముద్దీన్,మూల కృష్ణారెడ్డి,గుర్రం వాసు,కిమ్ ఫహాద్,అబ్దుల్ రహమాన్, అమీర్,వంగల విద్యాసాగర్,మేకల నరసయ్య,సత్తినేని శ్రీకాంత్,సిరిపురం లావణ్య నాగప్రసాద్,బషీరుద్దీన్,అబ్దుల్ గని,గడప అజయ్,గడప శ్రీనివాస్, మాలోతు మహాలక్ష్మి,శిల్ప,పెంట శేఖర్, సుకుర్,ఇమ్రాన్ ఘని పాల్గొన్నారు.



## కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయం

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

కరీంనగర్,ఆగస్టు 31(వాయిస్ టుడే): నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 45వ డివిజన్‌లో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు మరియు పైప్ డ్రైన్ నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి,మేయర్ ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు.నగరంలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడం,నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా కాలనీవాసుల దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు.పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను,కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావ్,స్థానిక కార్పొరేటర్ గుగ్గిళ్ళ జయశ్రీ శ్రీనివాస్,కార్పొరేటర్లు,మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు,కాలనీ ప్రముఖులు,డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డ్‌ను తరలించండి

**నగర ప్రజలను నరక కూపంనుండి కాపాడండి**

**సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం**

కరీంనగర్,ఆగస్టు 31(వాయిస్ టుడే): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆయాజ్ కి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో సంవత్సరాల కాలం నుండి డంపింగ్ యార్డ్ వర్షానికి తడుస్తూ దుర్వాసన వెదజల్లుతుందని,ఎండాకాలంలో డంపింగ్ యార్డ్ తగలబడి దట్టమైన పొగ వెదజల్లడం మూలంగా ప్రజలు శ్వాస కోసం బాదిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అనేకమార్లు సిపిఎం ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ ను తరలించాలని ఆందోళన పోరాటాలు చేశామని,బిజెపికి కరీంనగర్ పట్టణంలో మేయర్ పదవి ఇస్తే నెల రోజుల్లో డంపింగ్ యార్డ్ తరలిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.నగరంలోని రోడ్లు డ్రైనేజీ పాడైపోయాయని కొద్దిపాటి వర్షానికి కరీంనగర్ పట్టణం జలమయం అవుతుందని అన్నారు.కొత్త పాలకవర్గం నిధులు కేటాయించి రోడ్లు బాగు చేయాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ నల్ల కనెక్షన్ల ద్వారా నీరు కేవలం 30 నిమిషాలు 40 నిమిషాలు ఇస్తున్నారని అది కూడా రెండు మూడు రోజులకు ఒకసారి వస్తుందని రెగ్యులర్గా వచ్చే విధంగా నగర మేయర్ మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని అన్నారు.సర్ ఫారంలో అనేక తప్పిదాలు ఉన్నాయని ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని అనేకమంది ప్రజలు రావడం మూలంగా సౌకర్యాలు లేవని అన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ లోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరిందని పక్కా భవనం నిర్మించి లైబ్రరీ ఏర్పాటు చేయాలని అన్నారు.

# దళితులను అవమానపరిస్తే చూస్తూ ఊరుకోం..

**బిజెపి మతోన్మాదులు దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారు**

**బండి సంజయ్ వెంటనే సమాధానం చెప్పాలి**

**కొరివి అరుణ్ కుమార్**



కరీంనగర్,ఆగస్ట్ 31(వాయిస్ టుడే): దేశంలో అంటరానితనాన్ని ప్రోత్సహిస్తూ,మతం పేరిట కులం పేరిట భారతీయ జనతా పార్టీ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తుందని దళితులను అవమానపరిస్తే చూస్తూ ఊరుకోమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ అన్నారు.ఆగస్టు 8వ తేదిన ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్ లోని రామ్ లీలా మైదానంలో సభను నిర్వహించిన తర్వాత బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు ఆ సభా స్థలాన్ని శుద్ధికరణ పేరుతో గంగాజలంతో గోమూత్రంతో శుద్ధిచేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. టి.పి.సి.సి ఎస్ సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు,మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ పక్షాన ఉత్తరాఖండ్ హల్ద్వానీ లో మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని ఖండిస్తూ బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారి మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ కేసు నమోదు చేయాలని ఆయన స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఈ దేశంలో దళితులు హిందువులు కాదా,గడప లోపల కులం గడప దాటితే హిందువులం అని నినాదాలు పలికే బీజేపీ నాయకులకు దళితులు హిందువులుగా కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాదులు చేసిన ఈ శుద్ధీకరణ కార్యక్రమం పై కరీంనగర్ ఎంపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించాలని ఆయన సవాలు విసిరారు.ఇది కేవలం మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానం మాత్రమే కాదని యావత్ దళిత జాతికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,హోం శాఖ మంత్రి అమిత్ షా,బిజెపి నాయకులు ఏ ముఖం పెట్టుకొని దళితుల ఓట్లు అడుగుతారో సమాధానం చెప్పాలి అని ఆయన ప్రశ్నించారు.హల్ద్వానీ ఘటన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాబోయే రోజుల్లో బిజెపి నాయకుల ఇండ్లు ముట్టడించి వారిని రోడ్లపై తిరగకుండా చేస్తామని ఆయన హెచ్చరించారు.హిందువులంతా బంధువులే అని హితవు పలికే బండి సంజయ్ కి హల్ద్వానీ ఘటన కనిపించడం లేదా అని ఆయన ఎద్దేవా చేశారు.ఇకనైనా కులాల పేరిట మతాల పేరిట రాజకీయాలు మానుకోవాలని లేకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ముఖ్యంగా దళితుల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని దళితులను అవమానపరిస్తే దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్,ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్,మాజీ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్,దళిత కాంగ్రెస్ నాయకులు వెన్న రాజమల్లయ్య, సముద్రాల లక్ష్మణ్,మాతంగి అనిల్, జీడి రమేష్,మీసాల సాయిలు, దుబ్బాసి కుమార్,హస్తపురం రమేష్,ధ్యావ ప్రభాకర్,కనకం విద్యాసాగర్,గొట్టే బాబు ప్రణవ్, అరుణ్,పిల్లి అశోక్,వేల్పుల అనూష పాల్గొన్నారు.



## విద్య వ్యాపారీకరణను అరికట్టాలి

**ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి**

**డీఏటీఏ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**

కరీంనగర్,ఆగస్టు 31(వాయిస్ టుడే): విద్యను అంగడి సరుకుగా మార్చే విధానాలను స్వస్తి చెప్పి,కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డీఏటీఏ) డిమాండ్ చేసింది.కరీంనగర్ లోని తారక హోటల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. డా.మహమ్మద్ మోహినుద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది కానీ,నాణ్యమైన ఉచిత విద్యను అందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ప్రైవేట్ విద్యాసంస్థలతోనే నాణ్యత దొరుకుతుందనే నెపంతో,ప్రజలు విద్యా వ్యవస్థనుపెట్టుబడిదారులకు అప్పజెప్పడం వల్ల ఉన్నత వర్గాలకే మేలు జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ప్రమాణాలు లేకపోవడం వల్ల ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థుల్లో 75 శాతం మందికి నైపుణ్యాలు లేక ఉద్యోగాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 11 ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఉన్న మొత్తం విద్యార్థుల సంఖ్య కంటే,ఒక్క మల్లా రెడ్డి ప్రైవేట్ విద్యాసంస్థలోనే అంతకు పైగా అనగా 75 వేల మందికి పైగా విద్యార్థులు ఉండటం ప్రభుత్వ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు.ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది సింగిల్ టీచర్ విద్యాసంస్థలు అరాకొరా సదుపాయాలతో కొట్టుమిట్టాడుతున్నాయని విమర్శించారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత 92 వేల పాఠశాలలు మూసి వేయబడ్డాయి అన్నారు.ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ మొత్తం శ్రీ చైతన్య, నారాయణ జూనియర్ కళాశాలల యాజమాన్యాల గుప్పిట్లో ఉందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుకున్న విద్యార్థులు మానసిక వికలాంగులుగా మారుతున్నరన్నారు.ఉన్నత విద్య అనంతరం 80 శాతం మంది యువకులు నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు. స్వీడన్, ఫిన్లాన్ లాంటి దేశాలలో మాదిరిగా విద్యా వ్యవస్థ మొత్తం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలన్నారు.ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వ్యాపారీకరణ విధానాలను నిలిపివేసి,అందరికీ సమగ్ర ఉచిత విద్యను అందించే బాధ్యత తీసుకోవాలని,లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ లు జి.వెంకటదాసు,వినాయక్ రెడ్డి,కవి షాయెబ్ ఉల్లా,జర్నలిస్ట్ ఓ.సాంబశివరావు,పెరిక బిక్షపతి,డా.ఎం.ఎన్.నర్సయ్య పాల్గొన్నారు.

## సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో 25 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

**బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లకు రూ.29 లక్షలు..**

**వివిధ అభివృద్ధి పనులకు రూ.59 లక్షలు.**

**డ్రగ్స్ నిర్మూలనపై కౌన్సిలర్ల ప్రతిజ్ఞ.**




సిరిసిల్ల, ఆగస్టు 31 (వాయిస్ టుడే): సిరిసిల్ల పురపాలక సంఘ సాధారణ సమావేశం మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. మొత్తం 25 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశ పెట్టగా, అన్ని అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశం లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు డ్రగ్స్ నివారణ చర్యలు, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై కౌన్సిల్ సభ్యుల సూచనలు, సలహాల ను స్వీకరించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాము లు కావాలని ప్రతిజ్ఞ చేశారు.రాబోయే బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో ఉంచుకొని సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్‌తో పాటు విలీన గ్రామాలు, వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల కోసం లైటింగ్, గ్రావెల్, జేసీబీలు, బ్లేడ్ ట్రాక్టర్లు తదితర పనులు చేపట్టేందుకు మొత్తం 7 పనులకు రూ.29 లక్షలు కేటాయిస్తూ పరిపాలనా పరమైన మంజూరు ఇచ్చారు.బతుకమ్మ పాండ్లు, డ్రైనేజీ పనులకు రూ.59 లక్షలు తెలంగాణ సంస్కృతిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని వివిధ వార్డుల్లో బతుకమ్మ పాండ్లు ఏర్పాటు చేయడంతో పాటు డ్రైనేజీ కల్వర్టులు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు మొత్తం 8 పనులకు రూ.59 లక్షలు కేటాయించారు.సమావేశం లో వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఉద్ధరించిందేమీ లేదు ?

**కాంగ్రెస్ ది ప్రజాపాలన కాదు,ప్రజా వ్యతిరేక పాలన**

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణ్ చంద్ర**

కరీంనగర్,ఆగస్టు 31(వాయిస్ టుడే): కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజుల్లో ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని,ఆరు గ్యారెంటీలు,420 హామీలు నీటి మూటలు అయ్యాయని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణ్ చంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన పేరుతో పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తుందని ఆయన మండిపడ్డారు.ఎన్నికల సమయంలో అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు వాగ్దానాలు చేసిందని,ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు,420 హామీలు పూర్తిగా నీటి మూటలయ్యాయని విమర్శించారు.ఆ హామీలను అరకొరగా అమలు చేసి నేడు పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. ప్రస్తుతం కొత్తగా రాష్ట్రంలో 22-ఏ చట్టాన్ని తీసుకువచ్చి,భూ యజమానుల ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందని ఫైర్ అయ్యారు.ముఖ్యంగా సొంత భూమి హక్కుదారులను కూడా ఇబ్బంది పెట్టేలా వారి భూములను నిషేధిత 22-ఏ జాబితాలో చేర్చడం ద్వారా ప్రభుత్వం రైతులను,సామాన్య ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. నిరుద్యోగ భృతినీ గాలికి వదిలేసి,యువ డిక్లరేషన్ అటకెక్కించి,విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ నిధులను విడుదల చేయకుండా ప్రభుత్వం వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని,దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి ఉందని ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు.రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు ఇలా ఏ వర్గాన్ని చూసినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరాశలో



ఉన్నారని పేర్కొన్నారు. రుణమాఫీ,భృతి వంటి హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. కాంగ్రెస్ పాలన పూర్తిగా స్వార్ధ ప్రయోజనాలే లక్ష్యంగా, అధికారమే పరమావధిగా కొనసాగుతుందన్నారు.ప్రజా సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి, కేవలం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకే ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు.ఇది ప్రజా పాలన కాదు, పక్కా ప్రజా వ్యతిరేక పాలన అని ఘాటుగా విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలను, వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని,ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేసి,గత బిఆర్ఎస్ మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**